# పావన చరితుడు కె.బాలగోపాల్.. – సి.ధర్మారావు

(30 అక్టోబర్ 2019, ఆంధ్రజ్యోతి)

పావన చరితుల్ని గూర్చి ఎందరు ఎన్ని సంగతులు చెప్పినా, మళ్లీ మళ్లీ వినబుద్ధి అవుతుంది గదా. కె.బాలగోపాల్ గురించి అసంఖ్యాకంగా వస్తున్న రాతలు, కవితలు చూశాక నాకు సంబంధించిన ఒక చిన్న ఘటన కూడా నలుగురితో పంచుకోవాలనిపించింది. అది 1999 సంవత్సరం అని గుర్తు. ఒకనాటి మిట్ట మధ్యాహ్నం మా ఇంటి కాలింగ్ బెల్ మోగింది. వెళ్లి తలుపు తీసి చూస్తే, ఎవరో పరిచయం లేని పెద్దమనిషి. 'నేను కె. బాలగోపాల్‌ని' అన్నారు. నేను సంభ్రమంగా మీరు మా ఇంటికి రావటం అదృష్టం అని, లోపలికి ఆహ్వానించాను. కూచోబెట్టి మంచినీళ్లు తెచ్చిస్తే తాగారు.

నాకు అంతకు ముందు ఆయన్ని గుర్తుపట్టే పాటి పరిచయం లేకపోయినా, ఆయన ఎవరో, ఏమిటో నాకు చాలా వరకు తెలుసు. 'ఇంట్లో ఎవరూ లేరు, అయినా నాకు టీ పెట్టడం వచ్చు, తీసుకుందురు గాని' అన్నాను. ఈ లాంఛనం అసలు పట్టించుకోకుండానే–'నేను ఒక నోటిఫికేషను గురించి వచ్చాను. విశాఖ కోర్టులో గిరిజనుల కేసొకటి వాదిస్తున్నాను. ఆ రెవెన్యూ డిపార్టుమెంటు వాళ్లెప్పుడూ వాళ్లకు జాబులు, నోటీసులు ఇంగ్లీషులో పంపిస్తుంటారు. వాటిల్లో ఏముందో వాళ్లకు చెప్పేవారు లేరు. అలాంటివన్నీ తెలుగులోనే పంపాలని ప్రభుత్వ ఉత్తర్వులుంటే, నాకు కొంత ఉపయోగం ఉంటుంది' అన్నారు.

'ఓ తప్పకుండా, ఎన్టీఆర్ హయాంలో 1988 ఉగాది నాటికే అలాంటి సమగ్రమైన జీవో ఇచ్చాం' అని వెతికి తెచ్చి, ఆ జీవో ప్రతి ఒకటి ఆయనకు ఇచ్చాను. దాన్ని పై నుంచి కింది దాకా చదివి, 'ఇది చాలు, పనికొస్తుంది' అని వెళ్లటానికి లేచా రు. 'ఇంకా మీకు కాపీలు కావాలన్నా ఉన్నాయి' అన్నాను. 'వద్దు, వద్దు అవి మీ దగ్గరుంటేనే నలుగురికీ పనికొస్తయి' అన్నారు. ఆగండి, ఆటోరిక్షా వరకు వస్తానంటే, 'లేదు నేను స్కూటర్ మీద వచ్చాను' అంటూ ఆ ఎండలో స్కూటరెక్కి వెళ్లిపోయారు.